సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



టోల్‌మోత

167వ నంబర్ జాతీయ రహదారిపై నేటి నుంచి టోల్ చార్జీలు పెరగనున్నాయి.

వివరాలు 8లో ▸



సాగునీరేదీ?

ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు ఎప్పుడు అందిస్తారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.2 /23.1

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36
(శనివారం సాయంత్రం)

సహర్ 4-51
(ఆదివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

మాన్‌దొడ్డికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు



రాజోళి: రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీల్లో మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి రెండో స్థానం లభించింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఐటీ శాఖల మంత్రి కేటీఆర్, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా మాన్‌దొడ్డి గ్రామ సర్పంచ్ సవారి అవార్డు అందుకున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న మాన్‌దొడ్డిలో పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా వ్యవసాయ పనులకు వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేయడం, కూలీలకు ఉపాధి కల్పించడం వంటి పనుల ద్వారా ప్రత్యేక గుర్తింపు లభించినట్లు అధికారులు తెలిపారు. అవార్డు తీసుకునే కార్యక్రమంలో జెడ్పీచైర్ పర్సన్ సరిత, మాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ సెక్రటరీ దస్తగిరి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,510

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 4,111 క్వింటాళ్ల వేరుశనగ రాగా క్వింటాకు గరిష్టం రూ.7,510, కనిష్టం రూ.4,169, సరాసరి రూ.6,099 ధరలు లభించాయి. అలాగే, 440 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.6,170, కనిష్టం రూ.4,511, సరాసరి రూ.6,090 ధర పలికింది. 7క్వింటాళ్ల కంది రాగా, గరిష్టం రూ.7,909, సరాసరి రూ.7,606 ధరలు పలికాయి. 257 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2101, కనిష్టం రూ. 1987, సరాసరి రూ. 2086 ధరలు వచ్చాయి.

జిల్లా కేంద్రంలో విస్తృతంగా వాహన తనిఖీ



గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో పలు ముఖ్య రహదారుల్లో శుక్రవారం సాయంత్రం డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, సామర్థ్యాన్ని మించి గూడ్స్ వాహనాల్లో సరుకులను తరలించదన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, జరిమానాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లు, రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపదన్నారు. ఇదిలాఉండగా, తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీలో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్, ఏఎస్ఐ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మద్యం తాగి వాహనాలు నడిపితే మీతోపాటు ఎదుట వచ్చే వాహనదారులను కూడా ప్రమాదంలోకి నెట్టేసినట్లు అవుతుందని, ఒకవేళ అలా తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏఆర్ డీఎస్పీ ఇమ్మానుయేల్ అన్నారు. శుక్రవారం మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ వింగ్ కార్యాలయంలో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లు తప్పనిసరి అన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్, ట్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు మద్యంతాగి వాహనాలు నడిపితే జరిగే నష్టాలను వీడియో ద్వారా వివరించారు.

ఆదాయం ఫుల్



ఈ ఏడాది ప్రభుత్వ ఖజానాకు కాసుల గలగల

- ఆర్టీఏలో లక్ష్యానికి మించిన రాబడి
- రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.243 కోట్ల ఆదాయం
- ఎక్సైజ్ శాఖలో రూ.2516.24 కోట్ల మద్యం విక్రయాలు


పాలమూరు/గద్వాల క్రైం: ఈ ఏడాది ప్రధాన శాఖల నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. కరోనా వల్ల రెండేళ్లు రాబడి లేకున్నా.. ఈ ఏడాది ఆర్టీఏ, రిజిస్ట్రేషన్ల శాఖలు బాగా పుంజుకున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,02,069 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా.. వాటి ద్వారా రూ.243.02కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్టీఏ శాఖకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 46.51 కోట్ల లక్ష్యం ఇవ్వగా.. రూ.48.63 కోట్లు వచ్చింది. ఇక ఎక్సైజ్‌శాఖలో గతేడాది కంటే ఉమ్మడి జిల్లాలో కొంత మద్యం అమ్మకాలు తగ్గాయి. దీంతో 230మద్యం దుకాణాల పరిధిలో ఐఎంఎల్ 26,00,443కేసులు, బీరు 34,11,700కేసుల ద్వారా రూ.2,516.24 కోట్ల విక్రయాలు జరిగాయి.

రూ.33కోట్ల ఆదాయం పెరిగింది

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో జరిగిన లావాదేవీలపై ఈ సంవత్సరం ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం 1,02,069 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.243.02 కోట్ల ఆదాయం నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం 2021–22లో రూ.210.27కోట్ల ఆదాయం రాగా ఈసారి దాదాపు రూ.33కోట్లు పెరిగింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా..

కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం రూ. (లక్షల్లో)
అచ్చంపేట	3,827	534.13
అలంపూర్	2,359	317.71
ఆత్మకూర్	2,487	343.19
గద్వాల	13,872	2730.05
జడ్చర్ల	16,970	5409.04
కొల్లాపూర్	3,267	479.17
కల్వకుర్తి	9,688	2157.53
నాగర్‌కర్నూల్	8,789	1431.57
నారాయణపేట	7,012	1681.4
వనపర్తి	16,254	3688.03
మహబూబ్‌నగర్	14,880	4788.44
మక్తల్	2,664	741.54



ఆర్టీఏ శాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి ఆదాయం వచ్చింది. జోగుళాంబ గద్వాల జిల్లాకు ప్రభుత్వం రూ.46. 51 కోట్లు లక్ష్యాన్ని ఇవ్వగా.. రూ.48.63 కోట్లు ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి పురుషోత్తంరెడ్డి తెలిపారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, ప్రత్యేక డ్రైవ్‌లు, జరిమానాలు, త్రైమాసిక పన్నుల రూపంలో అదాయం సమకూరింది. ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసి 105 శాతం ఆదాయం వసూలు చేశారు. సిబ్బంది కృషితో పాటు సకాలంలో వాహనదారులు తమ వాహనల పన్నులను చెల్లించారు. 2021– 2022 ఆర్థిక సంవత్సరానికి రూ. 34.45కోట్లకు గాను రూ. 30.45 కోట్లు వసూలు చేశారు.




తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

■ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 230మద్యం దుకాణాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, నారాయణపేటలో కలిపి 90, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తి 37, జోగుళాంబ గద్వాలలో 36 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2020–21లో రూ.1852.93 కోట్ల ఆదాయం రాగా.. 2021–22లో రూ.2650.29కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు విక్రయాలు స్వల్పంగా తగ్గాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో మార్చి 30 నాటికి రూ.2516.24 కోట్ల విక్రయాలు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు మరో రూ.40 కోట్ల వరకు విక్రయాలు జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్లలో అత్యధిక విక్రయాలు జరిగాయి.

ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు (కాటన్లు/కేసులు)

జిల్లా	ఐఎంఎల్	బీరు
మహబూబ్‌నగర్+పేట	10,53,949	15,26,977
నాగర్‌కర్నూల్	6,33,350	9,41,680
గద్వాల	4,89,470	4,27,174
వనపర్తి	4,23,674	5,15,869



అన్ని రంగాల్లో 'పుర' అభివృద్ధికి కృషి



మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- గద్వాల మున్సిపల్ వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం
- అంచనా ఆదాయం రూ.21.58 కోట్లు, వ్యయం రూ. 20.98 కోట్లు



హాజరైన కౌన్సిలర్లు

గద్వాల: మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గద్వాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం చైర్మన్ బీఎస్ కేశవ్ అధ్యక్షతన జరిగిన 2023–24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆదాయ మార్గాలపై దృష్టిసారించాలన్నారు. వార్డులలో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే డబుల్ బెడ్‌రూం ఇళ్ల సర్వే జరుగుతుందని, ఒకే కుటుంబంలో ఎక్కువ మంది ఉండటం, రేషన్ కార్డు, రూ.రెండు లక్షల వార్షిక ఆదాయం, సొంత ఇళ్లు లేకపోవడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని విచారణ చేస్తున్నామని కౌన్సిల్‌కు వివరించారు. ఇళ్ల కేటాయింపులో రిజర్వేషన్లు ఉంటాయన్నారు.

రూ.60.14లక్షల మిగులు బడ్జెట్

అంతకుముందు ప్రతిపక్ష సభ్యుల సూచనలు.. పాలకపక్ష సభ్యుల సలహాల మధ్య గద్వాల మున్సిపల్ కౌన్సిల్ వార్షిక బడ్జెట్ ఆమోదముద్ర పొందింది. 2023–24 సంవత్సరానికి రూపొందించిన రూ.60.14 లక్షల మిగులు బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అంచనా ఆదాయం రూ.21.58 కోట్లు, అంచనా వ్యయం రూ.20.98 కోట్ల పద్దులతో బడ్జెట్‌ను రూపొందించారు. ఎలాంటి పన్నుల భారం మోపకుండా బడ్జెట్‌ను పొందుపర్చడం విశేషం. ఇద్దరు, ముగ్గురు సభ్యులు మాత్రమే బడ్జెట్ పద్దులపై అధికారులను నిలదీశారు.

సమస్యలు పట్టించుకోలేదు..

పట్టణంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో చోటు కల్పించలేదు. పట్టణంలో ప్రధాన కూడళ్ల వెడల్పు, ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్‌లను వినియోగంలోకి తేవడం, అంతర్గత రహదారుల విస్తరణ వంటి కీలక పనులకు గత ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. తాగా బడ్జెట్‌లోనూ కేటాయింపులు చేయకపోగా అభివృద్ధి ప్రసంగాలతో సరిపుచ్చారు.

మొక్కుబడిగా..

బడ్జెట్‌లో గత ఏడాది పద్దులకు, ఈ సారి బడ్జెట్ పద్దులకు పొంతన లేదని, మొక్కుబడిగా బడ్జెట్‌ను రూపొందించారని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు విమర్శించారు. వాస్తవ ఆదాయానికి, అంచనా ఆదాయానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. బడ్జెట్‌లోని ఏ పద్దు కూడా సరిపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకెల గారడీతో బడ్జెట్‌ను రూపొందించినట్లు కనిపిస్తుందని విమర్శించారు. పలు పద్దులపై అధికారులను ప్రశ్నించారు. అలాగే, బడ్జెట్‌లో ఆదాయం, వ్యయం బాగానే చూపుతున్నారని, పనులు వచ్చే సరికి జరగడం లేదని మెజార్టీ కౌన్సిలర్లు విమర్శించారు. బడ్జెట్‌లో చూపిన పద్దులను చూస్తే అంచనాలతో మభ్యపెట్టేలా ఉన్నాయని, వాస్తవంగా ఏ మేర ఆదాయం వస్తుందనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. పలు పద్దులపై అధికారులను నిలదీశారు.ఈ సమావేశంలో కమిషనర్ నర్సింహా, వైస్ చైర్మన్ బాబర్, డీఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం



బీచుపల్లిలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీమాన్ సుదర్శన్ నారాయన్ ఆధ్వర్యంలో శిష్య బృందం ఐదవరోజు ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, తిరుప్పావైతోమాల, నైవేద్యం, తీర్థప్రసాదగోష్టి, తదనంతరం విష్వక్షేనపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, కలశపూజ, అభిషేకం, ఆభరణ సమర్పణ, సామ్రాజ్య పట్టాభిషేకం, హోమం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు, పాల్గొన్నారు.

అగ్రిమెంట్‌పై తర్జన భర్జనలు



గట్టు పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన అధికారులు, దుకాణదారులు

గట్టు: గట్టు గ్రామ పంచాయతీ దుకాణాల అగ్రిమెంట్ వ్యవహారంపై పంచాయతీ అధికారులు తర్జన భర్జనలు పడుతున్నారు. శుక్రవారం గట్టు పంచాయతీలో సర్పంచ్ ధనలక్ష్మి, కార్యదర్శి జగన్నాథరావు, గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు సత్యానాయణ, వార్డు సభ్యులు, వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారితోపాటుగా గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో కొందరు దుకాణాలకు సంబంధించిన తాళాలను వేలంలో దక్కించుకున్న వారికి ఇచ్చేయాలని కోరారు. అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే తాళం ఇస్తామని కార్యదర్శి చెప్పారు. అయితే అగ్రిమెంట్ కేవలం రెండేళ్లు మాత్రమే అని, దుకాణాల అద్దె మూడు నెలలు అడ్వాన్స్‌గా చెల్లించాలని చెప్పడంతో దుకాణదారులతో పాటుగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డు సభ్యులు సైతం దుకాణాల అగ్రిమెంట్ కాల పరిమితి ఐదేళ్లకు తక్కువ కాకుండా ఉండాలని, పంచాయతీ తీర్మాణం కూడా చేయాలని కోరారు. దుకాణాల వేలం పాట సందర్భంలో ఐదేళ్లు అని చెప్పారని, ఇప్పుడేమో రెండేళ్లు అని ఏ లెక్కన చెబుతున్నారని పంచాయతీ కార్యదర్శిని గ్రామ యువకులు ప్రశ్నించారు. జిల్లా పంచాయతీ అధికారి చెప్పారని చెప్పగా, అధికారికంగా ఏమైనా లిఖిత పూర్వక ఆదేశాలు ఉంటే చూపించాలని కార్యదర్శిని ప్రశ్నించారు. లిఖిత పూర్వక ఆదేశాలు లేవని, కేవలం మౌఖిక ఆదేశాలు ఉన్నట్లు కార్యదర్శి తెలిపారు. ఇష్టం వచ్చినట్లు నిబంధనలు మార్చితే కుదరదని, అగ్రిమెంట్ పూర్తి చేసి అందజేస్తే, మిగతాది తాము చూసుకుంటామని చెప్పడంతో అగ్రిమెంట్ చేయాలా? వద్దా ? అన్న సంశయంలో అధికారులు పడ్డారు. కొంత సమయం కావాలని, జిల్లా అధికారులతో మాట్లాడి ఓ నిర్ణయం తీసుకుంటామని సర్పంచ్ ధనలక్ష్మీ కోరారు.

సమష్టి కృషితోనే చేనేత అభివృద్ధి



మాట్లాడుతున్న దోత్రే నారాయణ

రాజోళి: చేనేత కార్మికుల సహకారంతోనే సంఘం అభివృద్ధి చెందుతుందని రాజోళి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దోత్రే నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చేనేత కార్యాలయ భవనంలో చేనేత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 బడ్జెట్‌పై చర్చించారు. ఈ ఏడాది అంచనా బడ్జెట్ రూ.21.70లక్షలు కాగా ఇందులో ఖర్చులు పోను రూ.4.40లక్షలు లాభం రావచ్చని సంఘం అంచనా వేసింది. దీని కోసం సంఘంలోని ప్రతి కార్మికుడు నిష్పక్షపాతంగా, చేనేత అభివృద్ధి కోసం పనిచేయాలని అన్నారు. ఇప్పటికే ఎంతో మంది కార్మికులు నష్టపోతున్నారని, తద్వారా వృత్తికి ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాంటి పరిస్థితి నుంచి చేనేత వృత్తిని కాపాడేందుకు ప్రతి సభ్యుడు పాటు పడాలని అన్నారు. పట్టు వస్త్రాలు చేసే పనిని సంఘం ఆధ్వర్యంలో, సంఘం కోసం చేస్తే గుర్తింపు వస్తుందని అన్నారు. మాబు, బాబు శ్రీనివాసులు చేనేత సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

గద్వాల రూరల్: ఈవీఎం గోదాములను శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి తనిఖీ చేయాలనే ఆదేశాల మేరకు తనిఖీ ప్రక్రియ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గోదాముల వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వరలక్ష్మీ, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

'రాహుల్ అంటే బీజేపీకి భయం'



మాట్లాడుతున్న అద్దంకి దయాకర్

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ.. రాహుల్‌గాంధీ అన్నా.. బీజేపీకి భయమని, ఆదానీ వ్యవహారం గురించి పార్లమెంట్‌లో మాట్లాడినప్పటి నుంచే రాహుల్ గాంధీపై కుట్రలు పన్నుతూ అనర్హత వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. కరోనా తర్వాత దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూప్పకూలి ప్రజలు సంకట స్థితిలో ఉంటే బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని జైల్లో పెట్టడం అణిచివేత చర్య అన్నారు. జోడో యాత్రతో దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను చూసి బీజేపీ కుట్రలు పన్నిందన్నారు. బీజేపీ కేవలం అధికారం కోసమే పని చేస్తోందని, కాంగ్రెస్ పార్టీ అందరి అభ్యున్నతి కోసం పనిచేస్తుందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికతో మోదీ, ఆదానీ బండారం బయట పడిందని, దేశ సంపదను ఆదానీకి ధారాదత్తం చేస్తున్న తీరును ఆధారాలతోసహా రాహుల్ గాంధీ బయట పెట్టారని, అందుకే ఆయనను అప్రజాస్వామికంగా బయటకు పంపే ప్రయత్నం చేశారన్నారు. పదవులు త్యజించే కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ విషయంలో అప్రజాస్వామికంగా వ్యహరించిన బీజేపీకి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శంకర్, వీరుబాబు, ఉమాదేవి, ఇసాక్, జమాల్, జహంగీర్, రఘు నాయుడు, శివరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కొండేరులో మాట్లాడుతున్న సీఐ సూర్యనాయక్

ఎర్రవల్లిచౌరస్తా: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలంపూర్ సీఐ సూర్యనాయక్ సూచించారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని కొండేరులో ఎస్పీ ఆదేశాల మేరకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం, పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామ ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, షీ టీమ్స్, డయల్ 100, పోలీస్ చట్టాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోకడల గురించి పాటలు, మాటల రూపంలో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. ఎలాంటి ఉచితాలకు ఆశపడి అనవసరంగా మోసపోవద్దని, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం స్థానిక ఎస్సై గోకారి, షీటీమ్స్ ఇన్‌చార్జ్ రజిత మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా మత్తుపదార్థాలు, గుట్కాలు, గంజాయి విక్రయిస్తే సమాచారం అందించాలని, విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ నం .8712670312, 799313139 సమాచారం అందించాలన్నారు. కళా బృందం సభ్యులు రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు ఉన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా... మహిళా కూలీ దుర్మరణం

బల్మూర్: మండలంలోని అనంతవరం సమీపంలో అచ్చంపేట ప్రధాన రహదారిపై శుక్రవారం ట్రాక్టర్ బోల్తాపడి ఓ మహిళా కూలీ మృతి చెందిందని ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. లింగాల మండలం సూరాపూర్ నుంచి బల్మూర్‌కు ఇటుకల లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ ఖాళీ చేసిన అనంతరం తిరిగి వెళ్తుంది. అనంతవరం గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సూరాపూర్‌కు చెందిన నాగమ్మ(45) అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవర్ బాలస్వామి, కూలీలు బిచ్చాలి, గంగమ్మకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగమ్మ భర్త చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధరూరు: ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాంపల్లి, కోతులగిద్దె గ్రామాల మధ్య ఉన్న తాయమ్మ మిట్ట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం పట్టణంలోని బురుగుల పల్లికి చెందిన దేవుల్లహన్మిరెడ్డి(46) శుక్రవారం ఉదయం ఉరేసుకుని మృతిచెందాడు. నాలుగు రోజుల కిందట, గద్వాల మండలం గోనుపాడు సమీపంలోని సుబాబుల్‌తోటను నరికేందుకు పది మంది కూలీలతో కలిసి వచ్చాడు. కుటుంబ సమస్యలు, లేక వ్యక్తిగత అనారోగ్య సమస్యలో తెలియదు కాని చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ తెలియజేశాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దేవరకద్ర రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ భగవంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపల్లికి చెందిన మన్యం (56) రోజులాగే తన పొలానికి నీరు పారించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కరెంట్ పోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువుల తరలింపు నిందితులకు రిమాండ్

జడ్చర్ల: కంటైనర్‌లో పశువులను గుట్టుగా తరలిస్తున్న నలుగురు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. గురువారం ఆదిలాబాద్ నుంచి గోవాకు ఓ కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో 44వ నంబర్ జాతీయ రహదారిపై బూరెడ్డిపల్లి గ్రామశివారులో తనిఖీలు చేపట్టారు. కంటైనర్‌ను తెరచి చూడగా 32 పశువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న పశువులను హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని గోశాలకు తరలించామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: ఇంట్లోనే సెల్‌ఫోన్ వదిలేసి ఓ వ్యక్తి కన్పించకుండా పోయాడు. టూటౌన్ ఎస్ఐ సుజాత కథనం ప్రకారం.. హన్వాడ మండలం టంకరకి చెందిన కుర్మయ్య ప్రస్తుతం టైలరింగ్ పని చేస్తూ కొత్తగంజిలో నివాసం ఉంటున్నాడు. టంకర పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భార్య, కొడుకు సామగ్రి కోసం బయటకు వెళ్లిన సమయంలో కుర్మయ్య తన సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి వెళ్లిపోయాడు. అయితే ఈ నెల 29న స్వగ్రామం టంకరలో నిర్వహించిన పద్మశాలి సంఘం సమావేశంలో ఇతర సభ్యులతో డబ్బులు విషయంలో గొడవ జరిగినట్లు కుర్మయ్య భార్య రాధమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తికి జైలు శిక్ష

మరికల్: ఓ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఓ వ్యక్తికి నారాయణపేట జిల్లా కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. మరికల్ మండలం పల్లెగడ్డకు చెందిన రవి గతేడాది ఏప్రిల్ 13న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై లైగింక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ బాబు కేసు నమోదు చేశారు. జిల్లా జడ్జి రఫీ శుక్రవారం రవికి 4 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధించారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శుక్రవారం పూర్తి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సమాంతర కాల్వకు నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 810 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలి పారు.

‘చిరు’ధాన్యం.. ఆరోగ్య ధనం


మహబూబ్‌నగర్ మండలం మణికొండ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిరేఖ (ఫైల్)

- పోషణ్ పక్వాడాపై విస్తృత ప్రచారం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు
- చిరు ధాన్యాలతో వివిధ రకాల పదార్థాల తయారీ.. ప్రదర్శన

మహబూబ్‌నగర్ రూరల్: ‘చిరుధాన్యపు భోజనం చేయండి.. ఆరోగ్య ధనాన్ని సొంతం చేసుకోండి’... ‘ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆ మహాభాగ్యాన్ని ప్రసాదించేది చిరు (సిరి) ధాన్యాలే’ అంటూ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పోషణ పక్షంలో చిరు ధాన్యాలను పరిచయం చేస్తున్నారు.

■ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యపరంగా అందరికీ చిరుధాన్యాలు అవసరమయ్యాయి. దశాబ్దాల పాటు వాటికి దూరమై కోల్పోతున్నవేమిటో గుర్తించి వినియోగం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత విజ్ఞప్తితో ఐక్యరాజ్య సమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. విశ్వవేదికపై గుర్తింపు సాధిస్తే సరిపోతుందా? ప్రజల్లో అవగాహన పెరగాలని కేంద్రం శాఖల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో తాజాగా కొనసాగుతున్నది అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాలో మిల్లెట్స్ ప్రాధాన్యం తెలిపే కార్యక్రమాలు. ఇదివరకు సేంద్రియ సాగు, ప్రైవేటుకే పరిమితమైన చిరుధాన్యాల అంశం ప్రభుత్వ పరిధిలోకి రావడంతో ప్రజావసర అంశంగా మారింది.

ఆరోగ్య ప్రయోజనాలు..

మనం తీసుకునే ఆహారంలో బియ్యం, గోధుమ ఎక్కువపాళ్లు ఉంటుంది. వీటి స్థానంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడంతో అనేక విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజ, లవణాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. రక్తవృద్ధి, ఎదుగుదల, రోగ నిరోధకశక్తి, జీవక్రియ మెరుగునకు అవసరమైన పోషక విలువలు ఇవి అందిస్తాయి. రాత్రికి రాత్రి ప్రజలంతా మిల్లెట్స్ వైపు మారడం అసాధ్యం. అందుకు సరిపడా దిగుబడులూ లేవు. అందుకే నిత్యం ఒకపూట భోజనంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని.. క్రమంగా వీటి వినియోగం పెంచాలని సూచిస్తున్నారు.

సాగుకు అనుకూలం..

జీవనశైలిలో మార్పు కారణంగా పట్టణాల్లో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. సాగునీటి సౌకర్యం ఉన్న గ్రామాల్లో జొన్నల వాడకం ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో బియ్యం ఎక్కువ ఉపయోగిస్తారు. మిల్లెట్స్ వినియోగం ఎక్కువ కావాలంటే స్థానికంగా సాగు పెరగాలి. చీడపీడల బెడద తక్కువ, స్వల్ప నీటి అవసరం వంటి పర్యావరణ హితమైన పంటలు కావడంతో సాగుకు అనుకూలమని చెబుతున్నారు.

జిల్లాలో ఇలా...	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	4
అంగన్‌వాడీ కేంద్రాలు	1,185
ఏడాదిలోపు చిన్నారులు	7,306
ఆరేళ్లలోపు వారు	47,743
గర్భిణులు	6,741
బాలింతలు	7,792

అవగాహన కల్పిస్తున్నాం..



చిరుధాన్యాల ప్రాధాన్యతపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వీటి ద్వారా ఒనగూరే పోషక విలువలు వివరిస్తున్నాం. పోషకలేమి సమస్యలకు చక్కటి పరిష్కారమని చెబుతున్నాం. రకరకాల వంటలు ఎలా చేసుకోవచ్చో చూపిస్తున్నాం.

– జరీనాబేగం, డీడబ్ల్యూఓ

రోజువారీ కార్యక్రమాలు చేపడుతున్నాం..



మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నిర్మూలనే లక్ష్యంగా పోషణ పక్షం నిర్వహిస్తున్నాం. ఈ విషయాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం.

– నీరజ, అంగన్‌వాడీ టీచర్, చౌదర్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

చాలా విషయాలు తెలుసుకున్నాం..



అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించి ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. పిల్లలు, మహిళల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజెప్పారు.

– జయశ్రీ, లబ్ధిదారు, చౌదర్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్


పోషణ పక్వాడా

ప్రతి వంద గ్రాముల్లో లభించే పోషకాలు..

పోషక విలువలు	రాగులు	అరికలు	వరిగలు	కొర్రలు	సామలు	ఊదలు	సజ్జలు	గోధుమ	వరి
పిండి పదార్థాలు (గ్రాముల్లో)	72	65.9	70.4	60.9	67.5	65.6	67.5	71.2	78.2
మాంసకృత్తులు (గ్రాముల్లో)	7.3	8.3	12.5	12.3	7.7	6.2	11.6	11.8	6.8
కొవ్వు (గ్రాముల్లో)	1.3	1.4	1.1	4.3	4.7	2.2	4.8	2.0	2.7
శక్తి (కేలరీల్లో)	328	309	341	331	307	300	361	348	382
పీచు పదార్థం (గ్రాముల్లో)	1.5	9.0	2.2	8.0	7.6	10.1	1.5	1.2	0.2
కాల్షియం (మిల్లీగ్రాం)	34	27	14	31	17	20	42	41	10
ఇనుము (మి.గ్రా)	3.9	0.5	0.8	2.8	9.3	5.0	11.0	3.5	0.7
థైమిన్ (మి.గ్రా)	0.59	0.41	0.42	0.3	0.33	0.15	0.38	0.41	0.41
రైబోఫ్లేవిన్(మి.గ్రా)	0.11	0.28	0.19	0.09	0.1	0.09	0.21	0.04	0.1

15 రోజుల కార్యక్రమం..

స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు పోషణ్ పక్వాడా కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో ముఖ్యంగా సిరి ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. 8 రకాల మిల్లెట్స్‌తో తయారు చేసుకునే వంటల పుస్తకం ఒకటి భారత మిల్లెట్స్ పరిశోధన సంస్థ వెబ్‌సైట్‌లో ఉంచింది. అందులోని రకాలు పరిచయం చేస్తున్నారు.

సలేశ్వరం ఉత్సవాలకు నిబంధనలతో అనుమతి

మన్ననూర్: అటవీశాఖ నిబంధనల ప్రకారం ఈ నెల 5, 6, 7 తేదీల్లో సలేశ్వరం ఉత్సవాలు జరుపుకొనేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి ఈశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు మాత్రమే ఫర్హాబాద్ గేట్ నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు అనుమతి ఉంటుందని.. భక్తులు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టం నిబంధనలు పాటించాలని.. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- ప్లాస్టిక్ సామగ్రి, వస్తువులు అడవిలోకి తీసుకెళ్లకూడదు.
- బీడీలు, చుట్టలు, సిగరేట్లు కాల్చరాదు. అగ్గిపెట్టె తదితర నిప్పు రగిలించే వస్తువులకు అనుమతి లేదు.
- మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి రాంపూర్ పెంట వరకు దారి మధ్యలో వాహనాలు నిలుపరాదు. హారన్ శబ్దాలు చేయొద్దు.
- అటవీ ప్రాంతంలో మద్యం తాగడం, అసాంఘిక కార్యక్రమాలు నిషేధం
- దైవ దర్శనం చేసుకున్న భక్తులు సాయంత్రం 6 లోపు అటవీ సరిహద్దు నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

భారత్‌మాల బాధితులకు న్యాయం చేస్తాం


బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాంచందర్‌నాయక్

మరికల్: భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ప్లాట్లు కోల్పోయిన వారికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని ఆర్డీఓ రాంచందర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆయా భూములు, ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని ఆయనను కోరగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని, పనులకు ఆటంకం కలిగించొద్దని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

సకాలంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడొచ్చు


సీపీఆర్ శిక్షణను పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

రాష్ట్ర రోడ్డు భద్రతా విభాగం డీఎస్పీ చంద్రభాను

అడ్డాకుల: రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు సకాలంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని రాష్ట్ర రోడ్డు భద్రతా విభాగం డీఎస్పీ చంద్రభాను పేర్కొన్నారు. మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజాలో భూత్పూర్ సర్కిల్ పరిధిలోని పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది, రోడ్డు పక్కన ఉన్న హోటళ్ల నిర్వాహకులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేష్, భూత్పూర్ సీఐ రజితారెడ్డి, టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ మదన్‌మోహన్, ఎస్ఐలు విజయకుమార్, నరేష్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మరెడ్డి హాజరయ్యారు. తొలి గంటలో బాధితులకు చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి ఈఎంఆర్ఐ డాక్టర్ సతీష్‌కుమార్ వివరించారు. సీపీఆర్ విధానం గురించి అవగాహన కల్పించి పోలీసులు, ఇతర సిబ్బందికి శిక్షణనిచ్చారు. గుండెపోటుకు గురైన వారి ఛాతిపై రెండు చేతులతో ఒత్తిడి చేయాలని సూచించారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో బాధితులను ఆస్పత్రికి చేరిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

62 చోట్ల అవగాహన: డీఎస్పీ

రాష్ట్రంలో 860 పోలీస్‌స్టేషన్‌లు ఉండగా అత్యధిక ప్రమాదాలు చోటు చేసుకున్న 62స్టేషన్లను గుర్తించి వాటి పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు రోడ్డు భద్రతా విభాగం డీఎస్పీ తెలిపారు. చాలా మందిలో శారీరక శ్రమ లేకపోవడం వల్లే చిన్న వయసులోనే గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. ప్రమాదాలు అయినప్పుడు తక్షణమే స్పందించి సమాచారం ఇచ్చిన వారికి పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని, అటువంటి వారికి నగదు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ప్రమాద సమయంలో 108కు సమాచారం ఇచ్చి క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి చేర్చేలా చూడాలని కోరారు. మహబూబ్‌గనర్ డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ ప్రమాద బాధితులను కాపాడితే వారు మిమ్మల్ని దేవుడిలా చూస్తారని తెలిపారు.

బాధిత రైతు కుటుంబానికి న్యాయం

- కలెక్టర్ చొరవతో నెలరోజుల్లో ప్రొసీడింగ్ అందజేత
- సమగ్ర విచారణకు ఆదేశం


గొల్లఅచ్చన్న కుమారుడికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ బక్క శ్రీనివాసులు

హన్వాడ: రెవెన్యూ అధికారుల తప్పిదంతో ఓ రైతు నిండు ప్రాణం బలైన ఘటన పాఠకులకు విధితమే. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తూ ప్రొసీడింగ్ కాపీని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు శుక్రవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గొల్ల అచ్చన్న తండ్రి భీమయ్యకు గ్రామశివారులోని సర్వేనంబర్ 316లో 2.04 ఎకరాల భూమి ఉంది. అధికారుల తప్పిదంతో సరిగ్గా అదే పేరు ఉన్న మరో వ్యక్తి పేరిట నమోదు కావడంతో ఆందోళనకు గురయ్యాడు. ధరణి రాకతో భూ వివరాల నమోదులో తప్పులు దొర్లడం, మధ్య దళారులు, రెవెన్యూ అధికారులతో కలిసి ఇలాంటి తప్పిదాలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి. కాగా బాధిత రైతు గొల్ల అచ్చన్న తన పేరిట ఉన్న భూమిని కొత్త పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేసి, సరిచేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా.. ఫలితం లేకపోవడంతో ఫిబ్రవరిలో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ అదేనెల 24న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రవి బాధిత కుటుంబానికి జరిగేలా చర్యలు తీసుకున్నారు. పాత రికార్డుల ప్రకారం రైతుకు రావాల్సిన 2.04 ఎకరాల భూమిని టీఎం–33 మాడ్యూల్ ప్రకారం మార్పులు చేయించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అలాగే సమగ్ర విచారణకు ఆదేశించినట్లు సమాచారం. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఏఆర్ఐ సాదిక్ పాల్గొన్నారు.

మాచినేనిపల్లిలో వ్యక్తి హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- గ్రామంలో నెలకొన్న ఉద్రిక్తత
- ఆరుగురిపై కేసు నమోదు
- సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మనోహర్

కొల్లాపూర్ రూరల్: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తిని విచక్షణరహితంగా కొట్టి చంపిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా.. గురువారం రాత్రి శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మూరకొండ రాముడు (48) బోయ లక్ష్మి గ్రామ చివరిలో ఉన్న నర్సింహరావుతోటలో ఉన్నారు. గమనించిన బోయ లక్ష్మి కుటుంబసభ్యులు మూరకొండ రాముడిని కొట్టడంతో ప్రాణపాయ స్థితిలో ఉండగా కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా రాముడు చెందాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మృతదేహన్ని తిరిగి గ్రామానికి తరలించి ఆందోళన చేయాలని భావించగా ఆస్పత్రి వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. మృతదేహాన్ని తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సీఐ యాలాద్రి మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి న్యాయం చేస్తామని చెప్పడంతో సద్దుమనిగింది. దాడి స్థలాన్ని ఎస్పీ మనోహర్, డీఎస్పీ మోహన్ కుమార్, సీఐ యాలాద్రి, ఎస్ఐ బాలవెంకటరమణ పరిశీలించారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు బోయ లక్ష్మి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా మరోవైపు బోయ లక్ష్మి మూరకొండ రాముడు మృతి చెందిన విషయం తెలియడంతో పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహిస్తున్నారు. పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


రాముడు (ఫైల్)


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మనోహర్

టోల్ మోత

- నేటి నుంచి అమలులోకి..
- భారమంటున్న వినియోగదారులు

జడ్చర్ల: ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీన టోల్‌ఛార్జీలు పెంచుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ ఈ ఏడాది కూడా యధావిధిగా అమలుచేసింది. శనివారం నుంచి ఈ ఛార్జీలు అమలులోకి రానున్నాయి. జడ్చర్ల నియోజకవర్గంలోని 167 నంబర్ జాతీయ రహదారిపై మున్ననూర్ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా దగ్గర కూడా పెంచిన ఛార్జీలు వసూలు చేయనున్నారు.



మున్ననూర్ వద్ద టోల్ ప్లాజా

పెరిగిన ఛార్జీలు ఇలా..	వాహనాలు	సింగిల్ ట్రిప్	రానుపోను	నెల పాస్
	కార్లు, జీపులు చిన్న వాహనాలు	రూ.45	రూ.70..	రూ.1,550
	లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికిల్స్	రూ.75	రూ.155	రూ.2,505
	మినీ బస్, బస్సులు, ట్రక్కులు	రూ.155	రూ.235	రూ.5250
	భారీ వాహనాలు	రూ.300	రూ.450	రూ.10,020

సామాన్యులకూ భారమే..



టోల్‌ఛార్జీలు ఏటా పెంచుతూ పోతున్నారు. అసలే ఇంధన ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుండగా.. వీటికితోడు టోల్‌ఛార్జీలు పెరుగుతున్నాయి. వాహనాలు ఉన్న వారికి మాత్రమేగాక సామాన్య ప్రజలకు కూడా ఈ ఛార్జీలు భారంగా మారనున్నాయి.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రావెల్స్ యజమాని, జడ్చర్ల

క్లుప్తంగా...

ముగిసిన జీ20 సదస్సు

విశాఖలో 4 రోజులు కొనసాగిన సమావేశాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ వేదికగా మార్చి 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ 20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో 'రేపటి ఆర్థిక నగరాలు – అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అవకాశాలు'పై ప్రధానంగా సదస్సు జరిగింది. 14 సభ్య దేశాలు, ఎనిమిది అతిథి దేశాలు, పది అంతర్జాతీయ సంస్థలకు చెందిన 57 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఈబీఆర్‌డీ లాంటి అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ సదస్సుకు అధ్యక్షత వహించారు.

త్వరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

అమిత్ షా హామీ ఇచ్చారు: ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలోనే బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, బడ్జెట్ కూడా పెంచుతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరడి భూపేష్ సాగర్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం అమిత్‌షాతో భేటీ అయింది. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని, పట్టికలో దీనిని అదనంగా చేర్చాలని, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, పదోన్నతుల్లో, న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ తదితర 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమిత్ షాకు అందజేసింది. అనంతరం ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే, ఎల్‌ఐసీ, బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని అమిత్‌షాకు తెలిపినట్లు చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు మినహాయిస్తే అన్ని ప్రభుత్వాలూ కులగణనకు మద్దతిచ్చాయని, బీజేపీకి బీసీల పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించామన్నారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని, వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని అమిత్‌షా హామీ ఇచ్చారన్నారు.

'మార్గదర్శి' డాక్యుమెంట్లే సీజ్

- ఇతర ఏ సంస్థ వివరాలూ మావద్ద లేవు
- నాంపల్లి మేజిస్ట్రేట్ కూడా దీన్ని ధ్రువీకరించారు
- తనిఖీలు ముగిసినందున పిటిషన్‌ను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్, అనుబంధ సంస్థల డేటా మినహా మరే ఇతర సంస్థలకు చెందిన డేటా తాము సీజ్ చేసిన డాక్యుమెంట్లలో లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. సీజ్ చేసిన డాక్యుమెంట్ల జాబితాపై నాంపల్లి 14వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సంతకం చేశారని, ఆ కాపీని కోర్టుకు కూడా సమర్పించామని తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణను జాప్యం చేసేందుకే పిటిషనర్ ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేసింది. తమ సంస్థలో తనిఖీలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ బ్రహ్మయ్య అండ్ కో, పెద్ది చంద్రమౌళి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

తనిఖీలు ఆపాలని మాత్రమే కోరారు..

'మార్గదర్శిపై పలు ఆరోపణలున్నాయి. చిట్స్ ద్వారా వచ్చిన నగదును షేర్‌మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు మళ్లిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ప్రధాన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇది బడా వైట్ కాలర్ నేరం. సంస్థకు చెందిన పలు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. బ్రహ్మయ్య అండ్ కో కార్యాలయ తనిఖీల్లో మాత్రం పోలీసులు పాల్గొన్నారు. ప్రధాన కేసు విచారణ సందర్భంగా పలు డాక్యుమెంట్లను అధికారులు అడిగారు. మార్గదర్శి చార్టర్డ్ అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మం అండ్ కో వాటిని ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. తనిఖీలు ఆపాలని మాత్రమే పిటిషనర్ కోరారు. అవి ఎప్పుడో ముగిశాయి కనుక పిటిషన్‌ను కొట్టివేయాలి' అని గోవిందరెడ్డి కోర్టుకు నివేదించారు.

ప్రత్యేకంగా విచారణ ఎందుకు?

'మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి కోర్టు విధుల సమయం ముగిసిన తర్వాత కూడా ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? సామాన్యుడికి ఏదైనా ప్రాణం మీదకు వస్తే కోర్టు ఇలాగే వ్యవహరిస్తుందా..? ఇది ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సిన అవసరం ఉంది. లంచ్‌మోషన్ పిటిషన్‌లు వేయడం, కోర్టు విధులు ముగిసిన తర్వాత అత్యవసరంగా విచారణ జరిపి ఉత్తర్వులు పొందడం ద్వారా మార్గదర్శికో నీతి – సామాన్యుడికో నీతి అనే అభిప్రాయం నెలకొనే అవకాశం ఉంది' అని విచారణ సందర్భంగా స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను న్యాయమూర్తి ఏప్రిల్ 13వతేదీకి వాయిదా వేశారు.

తనిఖీలు ముగిశాక విచారణా?

తనిఖీలు ముగిసిన తర్వాత వాటిని ఆపాలన్న విజ్ఞప్తిపై ఇక విచారణ ఎలా కొనసాగిస్తామని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది నళినీకుమార్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ఆ పిటిషన్‌లో ఇంటర్ లొక్యుటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశామని నళినీకుమార్ నివేదించారు.

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణ



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. తొలుత శాస్త్రోక్తంగా హోమం, పూజలు నిర్వహించిన వేదపండితులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ధ్వజస్తంభంపై గ రుడ పతాకాన్ని ఎగురవేశారు.

– ఒంటిమిట్ట

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడి

- సీఎం జగన్‌పై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- వాటిని నిరసిస్తూ బహుజన పరిరక్షణ సమితి నేతల నిరసన
- శిబిరంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి అనుచరులు
- మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగేసిన వైనం
- ఈ గొడవను వైఎస్సార్‌సీపీ, బీజేపీ మధ్య ఘర్షణగా చిత్రీకరించేందుకు బాబు, పవన్‌ల యత్నం



దీక్షాశిబిరం వద్ద రెచ్చగొడుతున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు



బహుజన నేతలపై దాడులు చేస్తున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు, టీడీపీ నేతలు

తాడికొండ/సాక్షి, అమరావతి : అమరావతి దీక్ష శిబిరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రాజధానుల శిబిరం వద్ద నిరసన తెలిపిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలపై బీజేపీ ముసుగులోని టీడీపీ మాజీ మంత్రి అనుచరులు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడులను బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య చోటుచేసుకున్న ఘర్షణగా చిత్రీకరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాజకీయ డ్రామాకు తెరతీశారు. అమరావతి దీక్షలు 1200వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం మందడంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆదినారాయణరెడ్డి.. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో కలిసి వెళ్లారు. ఆ శిబిరంలో సీఎం జగన్‌పై ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం తాళ్లాయపాలెం జంక్షన్‌లోని మూడు రాజధానుల శిబిరంలో 915వ రోజు దీక్షలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలకు తెలిసింది. కాసేపటి తర్వాత ఆదినారాయణరెడ్డి, సత్యకుమార్, వారి అనుచరులు విజయవాడకు బయలుదేరారు. వారి వాహన శ్రేణి మూడు రాజధానుల శిబిరం వద్దకు చేరుకోగానే.. బహుజన పరిరక్షణ సమితి నాయకులు రోడ్డు పక్కన నిల్చొని శాంతియుతంగా నిరసన తెలిపారు. ఆదినారాయణరెడ్డి డౌన్ డౌన్.. అమరావతి వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అంటూ నినదించడంతో ఆదినారాయణరెడ్డి అనుచరులు వారిపై విచక్షణా రహితంగా దాడులకు దిగారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగారు. వారు ప్రతిఘటించడానికి సిద్ధమవుతుండగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనకు కారణమైన ప్రతిపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష శిబిరాన్ని సందర్శించిన బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఆయన అనుచరులు, టీడీపీ నాయకులు శిబిరం వద్ద ఉన్న మహిళలను జుట్టు పట్టుకొని తన్నారని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందన్నారు.

ఆదినారాయణరెడ్డి కోసమే..

మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి తీరుపై బహుజనులు నిరసన తెలపడంలో భాగంగానే ఈ సంఘటన జరిగిందని బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ఆ ఘటన సమయంలో 'నా పేరు ఎవరూ ఎత్తలేదు.. ఆదినారాయణరెడ్డి కోసమే ఆరా తీశారు. ఆయన నా కారు ఎక్కలేదు. ఉదయం నేను, ఆయన కలిసి వెళ్లాం. సభ నుంచి ఆయన కాస్త ముందుగా వచ్చారు. ఆ విషయం వారికి తెలియదు. ఎవరో నా కారుపై దాడి చేశారు' అని వివరించారు. కాగా, సత్యకుమార్ కారుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటన గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ దాదాగిరీ పరాకాష్టకు చేరిందన్నారు.

రహదారులకు మహర్దశ ₹



- ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థత
- రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం
- నాలుగేళ్లలో సాధించిన నిధులు రూ.23,471.92 కోట్లు
- నాడు ఐదేళ్లలో టీడీపీ తెచ్చింది రూ.10,660 కోట్లే

సాక్షి, అమరావతి: ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాదీ కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించింది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక ప్రణాళికలో రూ.12,130 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారుల ప్రాజెక్టులను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి చెందితేనే ఆమేరకు ఆర్థిక సంవత్సరం ఆఖరులో నిధులు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో పూర్తి సంతృప్తి చెందినందున రికార్డు స్థాయిలో వార్షిక ప్రణాళిక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ తరువాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నాడు కేంద్రంలో అధికారాన్ని పంచుకుని కూడా

నాడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా చంద్రబాబు జాతీయ రహదారుల అభివృద్ధికి తగిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. ఐదేళ్లలో టీడీపీ సర్కారు కేవలం రూ.10,660 కోట్లు మాత్రమే తేగలిగింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఈ ఒక్క ఏడాదిలోనే రూ.12,123 కోట్లు సాధించడం విశేషం. మొత్తం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.23,471.92 కోట్లు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక, తీర ప్రాంతాలు, ఎకనామిక్ జోన్లు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రహదారుల అభివృద్ధి జోరందుకుంది.

సీఎం జగన్ ప్రణాళికకు కేంద్రం ఆమోదం

2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీతో చర్చిస్తూ పట్టుబట్టి నిధులను సాధిస్తున్నారు. 2019–20 వార్షిక ప్రణాళికలో తొలుత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.600 కోట్లే కేటాయించింది. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి జగన్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ దృష్టికి తేవడంతో 2019–20లో రాష్ట్రానికి నిధుల కేటాయింపును రూ.1,304.42 కోట్లకు పెంచారు. ఇక 2020–21 వార్షిక ప్రణాళికలో కేంద్రం రూ.2,476.50 కోట్లు మంజూరు చేయగా, 2021–22లో ఏకంగా రూ.7,561 కోట్లు మంజూరు చేసింది. ఆ ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు కేటాయించడం గమనార్హం.

541.45 కి.మీ. మేర 24 ప్రాజెక్టులు

2022–23కి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళిక నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 24 ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. రూ.11699.55 కోట్లతో ఇప్పటికే 513.72 కి.మీ. మేర 21 ప్రాజెక్టులను పూర్తి చేసింది. రూ.431.27 కోట్లతో 27.73 కి.మీ.మేర మూడు ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేయనున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దేవరకద్ర రూరల్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం కౌకుంట్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌకుంట్ల –పేరూర్ గ్రామాల మధ్యలోని రైల్వే పట్టాల సమీపంలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు లభించలేదని, చనిపోయిన వ్యక్తి వయస్సు 56 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే 9440627522 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలియజేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దేవరకద్ర రూరల్: ప్రమాదవశాత్తు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటు చెసుకుంది. ఎస్‌ఐ భగవంత్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపల్లికి చెందిన మన్యం (56) రోజులాగే గ్రామ సమీపంలోని తన పొలానికి నీరు పారించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కరెంట్ పోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరిశీలిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సామాజిక భద్రతలో ప్రథమస్థానం

హన్వాడ: సామాజిక సురక్షితంలో కొనగట్టుపల్లి పంచాయతీ రాష్ట్రంలో ప్రథమ శ్రేణిలో నిలిచింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించి కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిల సమక్షంలో అవార్డును స్థానిక గ్రామసర్పంచ్ మానస అందుకున్నారు.



ఆర్డీఎస్ పూర్తి ఆయకట్టుకు సాగునీరేదీ?



కొంకలలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

శాంతినగర్: ఆర్డీఎస్ ద్వారా 87,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉన్నా.. కేవలం 40 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శాంతినగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మిళ్ల ఎత్తిపోతలను రూ.791 కోట్లతో నిర్మిస్తామని హామీ ఇచ్చి రూ.300 కోట్లతో లిఫ్ట్ ఏర్పాటు చేసి రిజర్వాయర్లు నిర్మించకపోవడంతో ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆర్డీఎస్‌కు నిధులు లేవని ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని 5 ఎకరాల బావిని నింపడానికి కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్ట్ ఏర్పాటుచేసి నాలుగు వేల ఎకరాలు సేకరించి రూ.1,891 కోట్లు వెచ్చించారని.. సిద్దిపేట అభివృద్ధికి 9 ఏళ్లలో రూ.714 కోట్లు కేటాయిస్తే అలంపూర్‌కు కేవలం రూ.20 కోట్లు, ఆర్డీఎస్ ఆధునికీకరణకు రూ.13 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వద్ద రూ.10 వేల కోట్ల స్పెషల్ ఫండ్ ఉందని.. అందులో రూ.వెయ్యి కోట్లు విడుదల చేసే వరకు పోరాడుతామని తెలిపారు.

మెగా జాబ్‌మేళా..

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏప్రిల్ 9న అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 50 కంపెనీల కంపెనీలను ఆహ్వానించామని.. 5 వేల మందికి ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అదేరోజు ఉప్పలక్యాంప్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కందుకంటి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎంసీ కేశవరావు, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి రవిచంద్ర, అలంపూర్ ఇన్‌చార్జ్ మధుగౌడ్, మండలపార్టీ అధ్యక్షుడు లక్ష్మన్న పాల్గొన్నారు.

ఓట్లు అమ్ముకోవద్దు..

ఎన్నికల సమయంలో ఓట్లు అమ్ముకోవద్దని, అభివృద్ధి పనులు చేయకుంటే నిలదీసే హక్కు కోల్పోతారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బహుజన రాజ్యాధికార యాత్ర ఏడోరోజు శుక్రవారం సాయంత్రం వడ్డేపల్లి మండలం కొంకలలో కొనసాగింది. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తప్పు ఒప్పుకొని.. సిట్‌కు లొంగిపోవాలి..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో నిందితుల గురించి ఫిర్యాదు చేసినా కేసులు పెట్టకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి కేవలం ప్రవీణ్‌కు 103 మార్కులు వచ్చాయన్నారు. కమిషన్ ఉద్యోగులు మాత్రం ముగ్గురికి 100కు పైగా మార్కులు వచ్చాయని చెబుతున్నారు. ఈ విషయం చైర్మన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వెంటనే కేబినెట్ మీటింగ్ పెట్టి గవర్నర్‌కు నివేదించాలన్నారు. కమిషన్ సభ్యులు తప్పు ఒప్పుకుని సిట్ అధికారులకు లొంగిపోవాలన్నారు.

మార్కండేయ ప్రాజెక్టు పూర్తికి రిలే దీక్షలు

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: నియోజకవర్గంలోని మార్కండేయ ప్రాజెక్టు పూర్తి కోసం రిలే దీక్షలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరునెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి.. 8 ఏళ్లయినా ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా భూ కబ్జాలు, ఇసుక అక్రమార్కులు పేట్రేగిపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ నీతివంతమైన పాలన అందిస్తే.. బీఆర్ఎస్, బీజేపీ హయాంలో అవినీతి రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ, అదాని, అంబానీలకు ఉన్న సంబంధమేంటో పార్లమెంటులో నిలదీయడంతో రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసేలా ప్రధాని మోదీ కుట్రలు చేశారని.. రెండేళ్లపాటు శిక్షపడేలా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య పాలన కొనసాగడం లేదని.. ప్రశ్నించే గొంతుకలను వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని.. దేశంలో రూ.లక్షల కోట్ల కుంభకోణాలు జరిగినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్ వ్యవసాయాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని నిల్వ చేసుకుంటే.. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి, మంత్రుల నిర్వాకంతో నీటిని విద్యుత్ వినియోగానికి వాడుకోవడంతో బ్యాక్‌వాటర్‌లో ప్రస్తుతం తాగునీరు లేకుండా పోయిందని వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీకి చేరిందని.. రాబోయే రోజుల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వైద్య కళాశాలను ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నారని.. అన్ని జిల్లాలకు ఎలా వచ్చిందో ఇక్కడికి కూడా మంజూరైందే తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. మార్కండేయ ప్రాజెక్టు పనులు ప్రారంభించకపోతే.. రిలే నిరహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు నాగం శశిధర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి అర్థం రవి, నాయకులు బాలాగౌడ్, నారాయణగౌడ్, పాండు, శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి



పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట రూరల్: పేదల భూములకు రక్షణ లేకుండా పోయిందని, అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమే కాకుండా వారిపైనే మళ్లీ కేసులు పెట్టి వేధించడం సరికాదని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో గాయపడిన నర్సింహ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి బాధితుల భూమిని పరిశీలించి వారితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యుగంధర్‌గౌడ్ మాట్లాడారు. బాధితుడు నర్సింహులుసాగర్‌కు వెల్టూర్ గ్రామ శివారులోని 736, 738 సర్వే నంబర్లలో 6 ఎకరాల 1 గుంట భూమి ఉందని, ఇందులో 1 ఎకరా 20 గుంటల భూమి రావాల్సి ఉందని, దీని గురించి కోర్టులో కేసు నడుస్తుందన్నారు. బాధితులకు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చిందన్నారు. అయినప్పటికీ మోహన్‌రావు, ప్రవీణ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీరి పక్క భూమి కొనుగోలు చేసి వీళ్ల భూములకు చొరబడ్డారన్నారు. అక్రమంగా పోల్స్ పాతే ప్రయత్నం చేయగా.. ఇదేంటని ప్రశ్నించినందుకు నర్సింహులుసాగర్‌ను అతని సోదరుడైన సురేష్‌పై దాడులు చేశారన్నారు. దీనిపై పెద్దమందడి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి ప్రోద్బలంతో దాడి చేసిన వారిపై కాకుండా, బాధితులపైనే కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం బాధితుడితో కలిసి పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంజన్న, శేఖర్, శివయాదవ్, బాలు, రమేష్, సతీష్, శేఖర్, అంజన్న, రాజు, వివేకానంద తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాడుదాం



దర్నాలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్–ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ, మహిళా బిల్లుకు చట్టబద్ధత, నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్–ఆర్ఆర్, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్–ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాన రాజకీయ పార్టీలు సమర్థిస్తూనే ఉన్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వంలో జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ కూడా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ బీజేపీ ప్రభుత్వానికి ఉందని, అనుకూలతను బట్టి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకునే విధంగా బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు ఇచ్చిన మాటను బీజేపీ చిత్తశుద్ధితో అమలు చేయాలని, అప్పుడే మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ధర్నాలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు జానయ్య, అశోక్, జంగయ్య, విజయ్, అంజమ్మ, కృష్ణ, భీమ్‌రాజ్, కురుమూర్తి, శ్యామ్‌సుందర్, మొగులయ్య, అనిల్ కుమార్, ఎ.రాజు, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చల్లాకు అభినందనలు

అలంపూర్: ఎమ్మెల్యే కోటాలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చల్లా వెంకట్రామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్‌లను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హైదరబాదులోని తన చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చల్లా వెంకట్రామిరెడ్డిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, ఎమ్మెల్యే అబ్రహం, పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

